క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఎంతో ప్రయోజనం



వీపనగండ్ల: సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక సహాయం అందించడంతో నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనమని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అన్నారు. బుధవారం కల్వరాల గ్రామంలో కొత్తకోట కల్యాణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.20,500 చెక్‌ను అందజేశారు. నియోజకవర్గంలో వందలాది మందికి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఈ సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, తిరుపతయ్య, మల్లేష్, శివుడు, రాముడు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసి రావాలి



ఆత్మకూర్: గ్రామాల్లో అభివృద్ధికి గ్రామస్తులు కలిసి రావాలని, కార్యదర్శులకు అండగా నిలువాలని ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మేడేపల్లి, మోట్లంపల్లి, పిన్నంచర్ల గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, నిత్యం డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ రాజీఖ్, శిరీష, భాస్కర్, కార్మికులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీఆర్‌డీఓ

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్ గ్రామంలో ఫీల్డ్‌అసిటెంట్‌గా పనిచేస్తున్న చల్మారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎంపీడీఓ రాఘవ, ఏపీఓ సుకన్య బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అతని తమ్ముడు భాస్కర్‌రెడ్డికి రూ.20 వేల అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిటెంట్లు నిరంజన్‌గౌడ్, నయ్యూంపాష, మాధవి, బాలయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ, టీఏ సుజాత, గోవిందు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి



ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరూ తప్పని సరిగా బీమా చేయించుకోవడం వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కుటుంబం వీధిన పడకుండా ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని అప్పారెడ్డిపల్లిలో బీమా, ఆర్థికాభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామపెద్దలు శంకర్‌గౌడు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలి

గోపాల్‌పేట: పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని, లేదంటే బీఆర్‌ఎస్వీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని మాజీ వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం రేవల్లి, ఏదుల మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలను బీఆర్‌ఎస్వీ నాయకులు సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు,పరిస్థితులను పరిశీలించారు.

కొత్తకోటలో బస్‌పాస్ కౌంటర్ కొనసాగించాలి



వనపర్తి టౌన్: కొత్తకోటలో బస్‌పాస్ కౌంటర్‌ను తొలగించకుండా యథావిధిగా కొనసాగించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్‌పాస్ కౌంటర్‌ను తొలగిస్తే విద్యార్థులు జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తుందని, తద్వారా విద్యాభ్యాసానికి అంతరాయం కలుగుతుందన్నారు. కొత్తకోట బస్‌పాస్ కౌంటర్ తొలగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. నితిన్, బాలు, చరణ్, మైబుబ్, సిద్దు పాల్గొన్నారు.

ముసురుతో చిగురించిన ఆశలు

- మొలకెత్తుతున్న విత్తనాలు
- ప్రాజెక్టులకు నీళ్లు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ



దుప్పల్లిలో పత్తి మొక్కలకు ఎరువు వేస్తున్న రైతులు

మదనాపురం: మే నెలలో మురిపించి వర్షం, ఆ తర్వాత ముఖం చాటేసింది. రెండ్రోజులుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతల్లో ఆనందాన్ని నింపుతోంది. జిల్లాలో మంగళవారం 11 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం సగటున 19.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పత్తికి ప్రాణం..

ఆలస్యంగా పడుతున్న వానలు.. ఎండిపోతున్న దశలో ఉన్న పత్తి పంటకు ప్రాణం పోశాయి. ఈసారి సీజన్‌కు ముందే తొలకరి పలకరించడంతో రైతులు పత్తి విత్తనాలు ముందే నాటారు. తర్వాత వర్షం ముఖం చాటేయడంతో పత్తి మొలకలు ఎండిపోయే దశకు చేరాయి. ఈ తరుణంలో కురుస్తున్న ముసురు వర్షం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. ప్రస్తుతం రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పత్తి మొలకలకు యూరియాతో పాటు వివిధ రకాల మందులు వేస్తున్నారు. ఎటు చూసినా పొలాల్లో కూలీలు కన్పిస్తున్నారు. పత్తి మొక్కలు బతుకుతాయా? లేదా అనే సందేహంలో ఉన్న రైతులకు ఈ వర్షాలు ఎంతో ఊరట నిచ్చాయి. మరో 20 రోజుల పాటు పంటలకు ఎలాంటి ఇబ్బంది లేదు. వరి రైతులు మాత్రం భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు బోరు, బావుల కింద మాత్రమే నారు పోశారు. వర్షాధారంగా కాలువ నీళ్లపై ఆధార పడ్డ రైతులు మాత్రం నార్లు పోసుకోవడానికి మరికొద్ది రోజులు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ఖిల్లాఘనపురం, మదనాపురం, రేవల్లి, గోపాల్‌పేట, వనపర్తి, పానుగల్ మండలాల్లో అధిక వర్షం పడింది. జిల్లాలోని మిగ తా మండలాల్లో సైతం సాధారణ వర్షం కురిసింది.

జిల్లాలో పంటల సాగు..

పత్తి 5 వేల ఎకరాలు, కందులు 2 వేల ఎకరాలు, ఆముదం 700 ఎకరాలు, మినుములు 200 ఎకరాలు, మొక్కజొన్న 600 ఎకరాలు సాగవుతోంది.

పత్తి పంటను కాపాడింది



మొదట్లో వచ్చిన వర్షాలతో నేను ఆరు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాను. మొలకెత్తాయి కానీ వర్షం లేకపోవడంతో వాడుముఖం పట్టాయి. మొలకలు ఎండిపోతున్న తరుణంలో వర్షాలు రావడం ఎంతో సంతోషం కలిగించింది. పత్తి మొక్కలకు జీవం పోసింది. పత్తి పంటకు మందులు పెడుతున్నాం.

– రాములు, రైతు, నెలివిడి, మదనాపురం

ఆరుతడికి నీరు లేకుండా చూడాలి



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి, ఆముదం పంటలకు ఎంతో ఊరటనిచ్చాయి. ప్రధానంగా పంట పొలాల్లో నిల్వ నీరు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పత్తి పంట ప్రధాన దశలు పుష్పించే నిర్మాణం, కాయల నిర్మాణం ఇవి క్లిష్టమైన దశలు. కలుపు మొక్కలు 20 రోజుల తర్వాత మొదటి కలుపు తీయాలి. రెండో కలుపు 40 రోజుల తరువాత తీసి పెండిమిథాలిన్ 1-1.5 లీటర్/ఎకరం పిచికారీ చేయాలి. తెగుళ్లు ఆనవాళ్లు కన్పిస్తే వెంటనే వ్యవసాయ అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేయాలి.

– గాయత్రి, ఏఓ, మదనాపురం

స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నంబావి: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలని నియోజకవర్గ నాయకులు ధారసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి నిదర్శనం రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు నియమించడమే అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని, వాటిని కార్యకర్తలు సోషల్‌మీడియా వేదికగా తిప్పికొట్టాలన్నారు. మండలంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గోపినాయుడు, సాయిప్రణీత్ గౌడు, హరికాంత్, పురేందర్‌గౌడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన తయారీలో శుభ్రత పాటించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న హెచ్‌ఎం భానుప్రకాష్

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీలో పరిశుభ్రతను పాటించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భానుప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ ప్రాథమిక పాఠశాల, బీసీ, ఎస్సీ కాలనీలోని పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పరంగా అందుతున్న పాఠ్య పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయిలత, కల్పన, సుస్మిత, రవి, రంజిత్, సీఆర్‌పీ వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర పశువర్ధక, మత్స్య, యువజన, క్రీడలశాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కట్టుబడి ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని జూరాల గ్రామం వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి (వంతెన) నిర్మాణానికి రూ.122 కోట్లు విడుదల చేశారని అన్నారు. కొంతమంది పనికట్టుకుని వదంతులు సృష్టిస్తున్నారని బ్రిడ్జి నిర్మాణం ఇక్కడ కాదని మరొకచోటు అని పుకార్లు పుట్టిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. జూరాల వద్దనే బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆత్మకూర్ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రెయినేజీలకు రూ.15 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, అశోక్, మహేష్, సాయిరాఘవ, శాలం, మశ్చందర్‌గౌడ్, ఆర్మీశివ, వడ్డెమణ్యం, అన్వర్‌పాషా, మల్లేష్, జహంగీర్, గాలిపంపు శ్రీను ఉన్నారు.

విద్యుత్ తీగలు మార్చాలని వినతి



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలో 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను మార్చాలని ట్రాన్స్‌కో ఏఈ సుమన్‌ను సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి మాట్లాడుతూ పట్టణంలోని 10 వార్డులలో ఉన్న విద్యుత్ స్తంభాల తీగలు చిన్న గాలికే విరిగి పడుతున్నాయని, దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో అన్న భయంతో పట్టణ ప్రజలు జీవించే పరిస్థితులు దాపరించాయన్నారు. పట్టణంలోని 2,3,6,7,10 వార్డులలో 11 కేవీ తీగలు ప్రజల జీవన విధానానికి ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని పట్టణ చివరికి మార్చాలని మున్సిపాలిటీలో తీర్మానం చేసినా ట్రాన్స్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 11 కేవీ విద్యుత్‌లైన్‌ను సైతం మార్చి పట్టణ ప్రజలకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ వైర్లను తొలగించి కొత్త లైన్ వేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, అజయ్, రమేష్, బుచ్చన్న, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సీసీ పనుల్లో నాణ్యత పాటించాలి



వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని 19, 20 వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మాణం చేపట్టిన సీసీరోడ్లలో నాణ్యత పాటించకపోవడం తో, నాసిరకంగా ఉన్నాయని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ ఆరోపించారు. బుధవారం సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 20వ వార్డులో కంకర వేసి నిర్మాణం చేపడుతున్న రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నాసిరకం రోడ్లకు బాధ్యులైన కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోని, రోడ్డు నాణ్యతగా నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాలకృష్ణ, చిన్నకురుమన్న, పృథ్వీనాదం, ఎర్రకురుమన్న, అరవిందు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

రేపు రైతు అవగాహన సదస్సు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులోని రైతు వేదికలో ఈనెల 4న చిన్నమందడి, పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి గ్రామాలకు చెందిన రైతులకు కూరగాయలు సాగు చేసే విధానంపై ఉద్యానశాఖ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్-జీడిమెట్ల వారు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కూరగాయల పరిశోధన శాస్త్రవేత్త, బిందుసేద్య నిపుణులు, జిల్లా ఉద్యాన మరియు మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొననున్నారని, కార్యక్రమంలో వివిధ రకాల కూరగాయల పెంపకం, కల్పించే రాయితీలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు ఉదయం 10 గంటలకు రైతు వేదిక దగ్గరకు చేరుకోవాలని, అవగాహన కార్యక్రమానికి వచ్చిన రైతులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

అందుబాటులో యూరియా



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడు బుధవారం తెలిపారు. కార్యాలయంలో 1350 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, బస్తా ధర రూ.2,236, కేంద్ర ప్రభుత్వం రూ.1969 రైతులకు అందిస్తుందన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఆత్మకూర్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 9,10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి సహకారంతో పట్టణానికి 144 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 65మంది ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మొదటి జాబితాలో రాని వారికి రెండో విడతలో అందరికి వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సలీంఖాన్, మోహన్‌రెడ్డి, సుభాష్, తయ్యాబ్, ఏజాజ్, శ్రీను, బాలరాజు, విజయ్, ఖలీల్, వెంకటస్వామి, మక్బుల్, నజీమ్, రవి, పరశురాం, నరేందర్, రాఘవేందర్, ప్రకాష్ ఉన్నారు.

ఆత్మకూర్: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని, విడతల వారీగా అందరికి న్యాయం చేకూరుతుందని మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం ఆత్మకూర్ పట్టణంలోని ఐదో వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ చేశారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అర్హులందరికి ఇళ్లు మంజూరు చేయిస్తారన్నారు. కార్యక్రమంలో షబ్బీర్, కళీం, చికెన్ వెంకటన్న, దామోదర్ ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో నివసిస్తూ, ఇల్లు కూలిపోయిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు రాని పేదలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. మున్సిపాలిటీలో వార్డుకు 10 చొప్పున 100 ఇళ్లకు ప్రతి పాదనలు పంపగా, కేవలం 54 మందికి మాత్రమే మంజూరు పత్రాలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. మున్సిపాలిటీలోని దళిత వాడలకు కేవలం 4 ఇళ్లను మంజూరు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా అర్హులకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు మాసన్న, రమేష్, రాజేష్, సంజీవ, రాజరత్నం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న అశ్విన్‌కుమార్

ఆత్మకూర్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని, జూరాల గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని, హామీలన్నింటిని నెరవేర్చాలని బీజేపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. బుధవారం అతిథిగృహంలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి గతంలో గాంధీచౌక్‌లో ప్రకటించిన హామీలను గుర్తు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో ధరూర్ మండలంలోని రేవులపల్లె, అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మించేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయని వెల్లడించారు. జూరాల వద్ద వంతెన నిర్మిస్తేనే ఆత్మకూర్ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, చెరువుకట్ట వెడల్పు, 100 పడకల ఆస్పత్రి, గురుకుల పాఠశాల, పీజీ కళాశాల, మినీ బస్‌డిపోలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆనంద్, ఆంజనేయులు, మండ్ల సూరి, బాలకృష్ణ, సమద్, రాఘవేందర్‌రెడ్డి, రమేష్, శ్యామ్, నవీన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వనపర్తిటౌన్: వర్షాలు పడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతాయని, నిల్వ నీటిని వాడకుండా ఎప్పటికప్పుడు డ్రమ్ములు, హైజ్‌లు, తదితర వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 4, 5, 6, 7, 9, 12, 14, 22, 24, 28, 29, 31 వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించారు. వీధుల్లో డ్రెయినేజీలో మురుగు దగ్గరుండి తీయించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ శంకరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, సూపర్‌వైజర్, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొనారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు
- కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కలిసికట్టుగా పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు, చెత్తను బయటపారబోయకుండా చెత్తడబ్బాల్లో వేసి చెత్తబండి వచ్చిన అనంతరం అప్పగించాలని సూచించారు. అనంతరం జాగ్రత్తలు, దోమల నివారణ, తదితర అంశాలపై క్లుప్తంగా కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శశిధర్

పట్టుకున్నారు.. వదిలేశారు!

- స్టేషన్‌కు తీసుకొచ్చిన మొర్రం ట్రాక్టర్లను వదిలేసిన పోలీసులు
- పోలీసుల తీరుపై విమర్శలు



పాన్‌గల్ స్టేషన్‌లో పట్టుబడిన ఐదు మొర్రం ట్రాక్టర్లు

పాన్‌గల్: చట్టాన్ని అందరికి ఒకే విధంగా అమలు చేస్తాం, ఎలాంటి పక్షపాతం చూపమని ఒక పక్క చెబుతున్నా అది ఎక్కడా అమలు కావడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాలు తమకు అనుకూలంగా ఉంటే ఒక రకంగా, అనుకూలంగా లేకపోతే మరో రకంగా వ్యవహరిస్తున్న పాన్‌గల్ పోలీసుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఎక్కువగా సివిల్ పంచాయతీల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సోమవారం అర్ధరాత్రి చిక్కేపల్లి గ్రామానికి చెందిన ఐదు మొర్రం ట్రాక్టర్లను ఎస్‌బీ పోలీసులు పట్టుకొని పాన్‌గల్ స్టేషన్‌కు తరలించి స్థానిక పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకొచ్చిన మొర్రం ట్రాక్టర్ల యజమానులపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వదిలేశారు. మొర్రంతో ట్రాక్టర్లు పట్టుబడి స్టేషన్‌కు తీసుకొచ్చిన వాటిపై కేసులు నమోదు చేయకుండా వదిలేయడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టి ముసుగులో ఇసుక అక్రమ రవాణా..

మట్టి ముసుగులో ఇతర ప్రాంతాలకు అక్రమ ఇసుకను తరలిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక పక్క అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానికంగా నియంత్రించాల్సిన పోలీసులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుందనే విమర్శలున్నాయి. సోమవారం అర్ధరాత్రి పట్టుబడిన మొర్రం ట్రాక్టర్లు కూడా ఇసుకను అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణంలో మొర్రం లోడ్‌తో వచ్చి పట్టుబడినట్లు తెలుస్తోంది. గతంలో ఎస్‌బీ పోలీసుల తనిఖీలో ఇదే గ్రామానికి చెందిన పలు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. మొర్రం ట్రాక్టర్లు పట్టుబడిన సంఘటనపై ఎస్ఐ శ్రీనివాసులను వివరణ కోరగా, మొర్రం ట్రాక్టర్లు స్టేషన్‌కు తీసుకొచ్చింది వాస్తవమేనని, మొదటి సారి కావడంతో మందలించి వదిలివేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మా దృష్టికి రాలేదు



పాన్‌గల్ స్టేషన్‌లో పట్టుబడిన ఐదు మొర్రం ట్రాక్టర్లను వదిలిపెట్టిన విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులతో తెలుసుకొని విచారణ చేస్తాం.

– కృష్ణ, సీఐ, వనపర్తి